# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 23-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రెండో విడత పద్మ అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ సాయంత్రం ప్రధానం చేశారు.
- ❖ పౌరులే కేంద్ర బిందువుగా సివిల్ సర్వెంట్లు పాలన సాగించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు.
- ❖ దేశవ్యాప్తంగా సుమారు 74 లక్షల మంది రైతులకు నాఫెడ్ పోర్టల్ సహాయం అందిస్తోందని కేంద్రమంత్రి అమిత్ షా తెలిపారు.
- ❖ నైరుతి రుతుపవనాలు దేశంలో చురుగ్గా కదులుతున్నాయని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది.

========================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రెండో విడత పద్మ అవార్డుల ప్రదానోత్సవం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఈ సాయంత్రం జరిగింది. ప్రముఖ మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మ విభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి పద్మ శ్రీ పురస్కారాలను అందుకున్న వారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ లు ఉన్నారు. అలాగే వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం మొత్తం 131 పద్మ అవార్డులను ప్రకటించింది. వీటిలో 5 పద్మ విభూషణ్, 13 పద్మ భూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మ పురస్కారాలను ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ప్రకటించిన పురస్కారాల్లో తొలి విడతగా 66 మందికి ఇటీవల అందజేయగా.. మిగిలిన వారికి ఈరోజు ప్రదానం చేశారు.

========================

'నాగరిక్ దేవో భవ' స్ఫూర్తితో అధికారులు పని చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో సహాయ కార్యదర్శులుగా పని చేస్తున్న 2024 బ్యాచ్‌కు చెందిన 183 మంది ఐఏఎస్ శిక్షణార్థులతో ప్రధాని న్యూఢిల్లీలో ఈరోజు సమావేశమయ్యారు. `వికసిత్ భారత్` లక్ష్య సాధనలో యువ సివిల్ సర్వెంట్లు కీలక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. దేశ నిర్మాణంలో బలమైన లక్ష్యసాధన, నూతన ఆవిష్కరణలు, పౌర కేంద్రీకృత పాలనపై దృష్టి సారిస్తూ.. అంకితభావంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వంలోని అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఇంకా 10 భారత జెండా కలిగిన నౌకలు ఉన్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. న్యూఢిల్లీలో ఈ మధ్యాహ్నం జరిగిన పాత్రికేయుల సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఆ వివరాలను వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య జూన్ 17న అవగాహన ఒప్పందం కుదిరిన తర్వాత ఇప్పటివరకు 11 భారతదేశానికి వచ్చే నౌకలు హార్ముజ్ జలసంధి ద్వారా ప్రయాణించాయని తెలిపారు. వీటిలో 3 భారత జెండా కలిగిన ముడి చమురు రవాణా నౌకలు ఉన్నాయని, ఒక్కో నౌకలో 2 లక్షల 85 వేల మెట్రిక్ టన్నులకు పైగా ముడి చమురు ఉన్నట్లు తెలిపారు. అదనంగా ఒక విదేశీ జెండా కలిగిన ఎల్పీజీ రవాణా నౌక, ఒక విదేశీ జెండా కలిగిన ముడి చమురు నౌక, ఎరువుల సరుకును తీసుకెళ్తున్న మరో ఆరు విదేశీ జెండా కలిగిన బల్క్ క్యారియర్లు ఉన్నాయని వివరించారు. మిగిలిన భారత జెండా కలిగిన నౌకలు కూడా త్వరలోనే హార్ముజ్ జలసంధిని దాటుతాయని తెలిపారు. అదే విధంగా ఖతార్‌లో ఇటీవల జరిగిన పేలుడు ఘటనపై రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ వాణిజ్యం గత త్రైమాసికంలో 5.4 శాతం వృద్ధి సాధించిందని నీతి ఆయోగ్ వైస్ ఛైర్ పర్సన్ డాక్టర్ అశోక్ కుమార్ లాహిరి తెలిపారు. న్యూఢిల్లీలో ట్రేడ్ వాచ్ త్రైమాసిక నివేదిక తాజా ఎడిషన్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. గత త్రైమాసికంలో భారత ఎగుమతులు 1.84 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నాయని లాహిరి తెలిపారు. అదే సమయంలో దిగుమతులు 6.5 శాతం వృద్ధి చెందినట్లు పేర్కొన్నారు. ప్రపంచ వాణిజ్యంలో భారత్ పాత్రను విశ్లేషిస్తూ.. ఈ నివేదికను రూపొందించామని, ముఖ్యంగా ఔషధ రంగ వాణిజ్యంపై ప్రధానంగా దృష్టి సారించినట్లు ఆయన చెప్పారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నాఫెడ్ కొత్త వేలం పోర్టల్ 'NAFEX.in' ను కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రారంభించారు. అనంతరం అమిత్ షా ప్రసంగిస్తూ... ఈ డిజిటల్ వేదిక ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, పారదర్శక వేలం ప్రక్రియలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. నేషనల్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (NAFED) దేశవ్యాప్తంగా సుమారు 74 లక్షల మంది రైతులకు సహాయం అందిస్తోందని అమిత్ షా తెలియజేస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

అంతకుముందు శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా అమిత్ షా ఆయనకు నివాళులు అర్పించారు. దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ కీలక పాత్ర పోషించిన గొప్ప నాయకుల్లో ఒకరని కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ కవరత్తిలు ఈరోజు వియత్నాం చేరుకున్నాయి. స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ ఉదయగిరి, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ కొర్వెట్ ఐఎన్ఎస్ కవరత్తి ఆపరేషనల్ డిప్లాయ్‌మెంట్‌లో భాగంగా వియత్నాంలోని న్హా రాంగ్ పోర్టుకు చేరుకున్నాయని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత నౌకలకు వియత్నాం పీపుల్స్ నేవీ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ స్వాగత కార్యక్రమం ఇరు దేశాల నౌకాదళాల మధ్య ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని, పెరుగుతున్న సముద్ర భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. గత మే నెలలో భారత్-వియత్నాం ద్వైపాక్షిక సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేరుకున్న తర్వాత వియత్నాంలో భారత నౌకాదళం చేపడుతున్న తొలి ప్రధాన స్థాయి సముద్ర ఉనికి ఇదేనని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని భారత వాతావరణ విభాగం IMD తెలిపింది. తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బీహార్‌లోకి ప్రవేశించి వేగంగా విస్తరిస్తున్నాయని IMD అధికారులు పేర్కొన్నారు. దీంతో ఆయా రాష్ట్రాల్లో పలు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మధ్య అరేబియా సముద్రంలో ఏర్పడిన అనుకూల వాతావరణ పరిస్థితుల వల్ల రుతుపవనాలు చురుగ్గా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో గుజరాత్, మధ్యప్రదేశ్‌తో పాటు మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయని తెలిపారు. రుతుపవనాల ప్రభావంతో రానున్న వారం రోజుల పాటు పశ్చిమ తీరం వెంబడి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ శాస్త్రవేత్త సుప్రీత్ కుమార్ వెల్లడిస్తూ...

(వాయిస్ 19 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ప్రపంచ వ్యాప్తంగా ఇంధన భద్రతను మరింత బలోపేతం చేస్తుందని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పేర్కొన్నారు. హార్మూజ్ జలసంధి తిరిగి తెరవడాన్ని భారత్ స్వాగతిస్తోందని చెప్పారు. దీని వల్ల సరఫరా వ్యవస్థలోని అడ్డంకులు తొలగిపోతాయని, ఎరువులు, రసాయనాలు వంటి కీలక వస్తువుల కొరతను పరిష్కరించేందుకు ఇది సహాయపడుతుందని తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన 16వ బ్రిక్స్ జాతీయ భద్రతా సలహాదారుల సమావేశంలో అజిత్ దోవల్ మాట్లాడుతూ... ప్రస్తుతం ఉద్భవిస్తున్న భద్రతా సవాళ్ళు, సంప్రదాయేతర ముప్పులు దేశ సరిహద్దులను దాటి విస్తరిస్తున్నాయన్నారు. ప్రపంచ భద్రతా పరిస్థితుల్లో వస్తున్న మార్పులను ఎదుర్కొనేందుకు దేశాలు పరస్పర సహకారం, సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 135వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =